ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 నంద్యాల జిల్లా వార్తలు
శుక్రవారం 8 మార్చి 2024

ఆవగింజలతో పరమశివుడు



నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆవగింజలతో ఆదిదేవుడైన శివుడి చిత్రాన్ని రూపొందించాడు. రెండు రోజుల పాటు కష్టపడి కోటేష్ శివయ్య మోమును చిత్రీకరించాడు. ఇందుకోసం 3,250 ఆవగింజలను వినియోగించాడు.ఈ చిత్రంలో తలపై గంగ, సిగలో నెలవంక, మెడలో నాగరాజు భక్తులకు స్వామి దీవిస్తున్నట్లు చిత్రాన్ని వేశారు. - నంద్యాల కల్చరల్


గజ వాహనంపై విహరిస్తున్న స్వామి అమ్మవార్లు


భక్తుల కోలాటాలు


కంపార్టుమెంటులో వేచి ఉన్న భక్తులు


శంఖానాదం చేస్తున్న సాధువు

గజవాహనంపై ఆదిదేవుడి వైభవం

- నేడు శ్రీశైలంలో మహా శివరాత్రి, కల్యాణోత్సవం
- అద్భుత ఘట్టం పాగాలంకరణకు సర్వం సిద్ధం


మహిషాసురమర్దిని అలంకారంలో కళాకారులు



పల్లకిపై ఊరేగుతున్న శ్రీశైలం పీఠాధిపతి


శ్రీశైలానికి కాలి నడకన వెళ్తున్న భక్తులు










మాఢ వీధులు, పాతాళగంగ వద్ద భక్తుల రద్దీ

శ్రీశైలం, మార్చి 7: ఇల కైలాసం శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడోరోజు గురువారం భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చాడు. ముందుగా ఉభయ దేవాలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో ప్రత్యేక అలంకృతులైన స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను సుగంధ పుష్పాలతో ముస్తాబైన గజవాహనంపై కొలువుదీర్చారు. స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాలు, కళాకారుల సంగీత, జానపద నృత్యాల నడుమ ఆలయం నుంచి వెలుపలికి తోడ్కొనివచ్చారు. గంగాధర మండపం వద్ద ప్రత్యేక పూజల అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం ఎదుట కోలాటం, చెక్కభజన, రాజభటుల వేశాలు, బీరప్పడోలు, తప్పెట్లు తదితర కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు.

నేడు కల్యాణోత్సవం

శుక్రవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సాయంత్రం 5 గంటలకు ప్రభోత్సవం, రాత్రి 7 గంటలకు నందివాహన సేవ, రాత్రి 10 గంటలకు లింగోద్భవకాల మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పాగాలంకరణ, రాత్రి 12 గంటలకు స్వామి, అమ్మవార్లకు కల్యాణమహోత్సవం జరిపించనున్నారు.

అద్భుత ఘట్టం పాగాలంకరణ

శివరాత్రి పర్వదినాన అన్ని శివ క్షేత్రాల్లో స్వామి అమ్మవార్ల వివాహ మహోత్సవం జరుగుతుంది. అయితే శ్రీశైలం క్షేత్రంలో జరిగే కార్యక్రమాలకు ఓ ప్రత్యేకత ఉంది. ఇక్కడ పెళ్లి కుమారుడిగా ముస్తాబయ్యే శివుడికి పాగాలంకరణ కార్యక్రమం జరుగుతుంది. మిగతా ఏ శైవ క్షేత్రంలోనూ ఇలాంటి వేడుక జరగదు. లింగోద్భవ సమయం దగ్గరపడగానే పాగాలంకరణ కార్యక్రమం కూడా మొదలవుతుంది. అది ముగిసే సమయానికి పాగాలంకరణ కార్యక్రమం పూర్తవుతుంది.


ఆలయ ప్రధాన ద్వారం ఎదుట గజవాహనంపై శ్రీశైలేశుడు



ఈ కార్యక్రమం సమయంలో భక్తులు ఆలయం లోపల ఉండేందుకు అనుమతి చూపతారు.


పాదయాత్రగా తరలివస్తున్న భక్తులు

● మూడు తరాలుగా..

బ్రహ్మోత్సవాల్లో స్వామివారికి తలపాగా చుట్టే కార్యక్రమాన్ని మూడు తరాలుగా ఒంగోలు జిల్లా చీరాల మండలం, హస్తినాపురానికి చెందిన పృథ్వీ వెంకటేశ్వర్లు కుటుంబం చేస్తోంది. ఏడాది పాటు మల్లన్న దీక్షలో నిష్ఠగా ఉండి రోజుకు ఓ మూర చొప్పున 365 మూరల వస్త్రాన్ని నేస్తారు. ఇలా పూర్తిగా నేసిన తర్వాత ఈ వస్త్రాన్ని భక్తి శ్రద్ధలతో హస్తినాపురంలో ఊరేగిస్తారు. ఆ తర్వాత స్వామి వారి సన్నిధికి తరలిస్తారు. పాగాలంకరణ చేసే సమయంలో ప్రధాన ఆలయంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారు. ఆ తర్వాత పృథ్వీ వెంకటేశ్వర్లు దిగంబరుడై పాగాలంకరణ సేవను మొదలుపెడతారు. ఈ సమయంలో ప్రధాన ఆలయంపైన ఎలాంటి వెలుగు పడనివ్వకుండా అలాగే సెల్‌ఫోన్లతో ఫొటోలు తీయనివ్వకుండా దేవస్థాన సిబ్బంది జాగ్రత్తలు తీసుకుంటారు.

అవినీతిపై విజయం సాధిద్దాం

- అరాచక పాలనకు స్వస్తి పలుకుదాం
- ప్రజలకు నారా భువనేశ్వరి పిలుపు
- పత్తికొండ ప్రాంతంలో 'నిజం గెలవాలి' పర్యటన
- బాధిత కుటుంబాలకు పరామర్శ, ఆర్థిక సాయం


కడమకుంట్లలో వడ్డే చిన్నరంగన్న కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న దృశ్యం


నారా భువనేశ్వరిని చూసేందుకు తరలివచ్చిన జనం


మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

పత్తికొండ/తుగ్గలి/క్రిష్ణగిరి, మార్చి 7 : అవినీతిపై విజయం సాధించేందుకు ప్రజలు సన్నద్ధం కావాలని నారా భువనేశ్వరి అన్నారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా గురువారం ఆమె కర్నూలు జిల్లా పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో పర్యటించారు. పత్తికొండ నియోజకవర్గం క్రిష్ణగిరి మండల పరిధిలోని ఎస్‌హెచ్ ఎర్రగుడిలో తరలి వచ్చి జనసందోహాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. వైసీపీ అరాచక పాలనతో రాష్ట్రం అన్ని విధాల వెనకబడి పోయిందని, కనీసం రాజధాని కూడా లేని దారుణ పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నామన్నారు. ఇలాంటి పరిస్థితిలో రాష్ట్రం తిరిగి అభివృద్ధి వైపు అడుగులు వేయాలంటే టీడీపీతోనే సాధ్యమని చెప్పారు. అధికారం కోసం వచ్చే ఎన్నికల్లో వైసీపీ అరాచకాలకు తెగబడే అవకాశాలు ఉన్నాయని, ఓటుతో ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఆమె వెంట టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు, పత్తికొండ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు, ఆదోని ఇన్‌చార్జి మీనాక్షి నాయుడు, సోమిశెట్టి వెంకటేశ్వర్లు ఉన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ..

పత్తికొండ నియోజకవర్గ పరిధిలోని తుగ్గలి మండలం మిథే తండాకు మధ్యాహ్నం 1.40 గంటలకు చేరుకున్నారు. చంద్రబాబునాయుడు అరెస్టుతో గుండె పోటుకు గురై మరణించిన మాజీ ఎంపీటీసీ రమావత్ లక్ష్మి కుటుంబాన్ని పరామర్శించి చిత్రపటానికి నివాళులర్పించారు. రమావత్‌లక్ష్మి కుమారుడు స్వామినాయక్‌కు రూ.3 లక్షల ఆర్థిక సాయం చెక్‌ను అందించారు. 2.35 గంటలకు తుగ్గలి మండలం కడమకుంట్ల గ్రామానికి చేరుకున్నారు. చంద్రబాబు అరెస్టుతో మృతి చెందిన వడ్డె చిన్నరంగన్న కుటుంబాన్ని పరామర్శించారు. భార్య నాగేంద్రమ్మకు రూ.3 లక్షల ఆర్థిక సాయం చేశారు. 4.30 గంటలకు క్రిష్ణగిరి మండలం ఎస్‌హెచ్ ఎర్రగుడి గ్రామానికి చేరుకొని పింజరి సుభాన్ కుటుంబాన్ని పరామర్శించారు. సుభాన్‌కు ఒక కూతురు, ఇద్దరు కుమారులు సంతానం. కూతురు ఆస్మకు పుట్టుకతోనే కళ్లు కనిపించవని కేఈ శ్యాంబాబు వారి పరిస్థితి గురించి వివరించారు. దీంతో భువనేశ్వరి వారిని దగ్గరకు తీసుకుని చిన్నారి కంటి చూపు బాధ్యత తీసుకుంటామని, అలాగే చిన్నారులను ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా చదివిస్తామని హామీ ఇచ్చారు. రూ3.లక్షల ఆర్థిక సాయం చేశారు.

భువనేశ్వరికి ప్రజల ఆత్మీయ పలకరింపు..

పత్తికొండ నియోజకవర్గంలోని మిథే తండా, కడమకుంట్ల గ్రామాలలో నారా భువనేశ్వరిని చూసేందుకు మహిళలు పెద్దఎత్తున తరలి వచ్చారు. వృద్ధులు ఆమెను చూసేందుకు ఇబ్బందులు పడడం గమనించి వారి వద్దకు వెళ్లి పలకరించారు. క్రిష్ణగిరి మండలం ఎస్‌హెచ్ గ్రామంలో ప్రజలు పెద్దఎత్తున తరలి రావడంతో మైక్ తీసుకుని ప్రజలనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో పత్తికొండ, తుగ్గలి, క్రిష్ణగిరి మండలాలకు చెందిన టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, బత్తిన వెంకట్రాముడు, తుగ్గలి నాగేంద్ర, మనోహర్ చౌదరి, ప్రమోద్‌కుమార్‌రెడ్డి, రామానాయుడు, చల్లా రవీంద్రనాథ్ చౌదరి, సోమ్లానాయక్ పాల్గొన్నారు.

అలిగేర గ్రామంలో..

ఆస్పరి, మార్చి 7: మండలంలోని అలిగేర గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఉరుకుందప్ప కుటుంబానికి అండగా ఉంటామని నారా భువనేశ్వరి అన్నారు. గురువా రం అలిగేర గ్రామంలో ఉరుకుందప్ప భార్య శేషమ్మకు రూ.3 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఆలూరు, ఆదోని, పత్తికొండ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిలు కోట్ల సూజాతమ్మ, మీనాక్షి నాయుడు, శ్యాంబాబు, నియోజకవర్గ నాయకురాలు వైకుంఠం జ్యోతి, గుడిసె కృష్ణమ్మ, పరమారెడ్డి, ఎంపీటీసీ రహిమతుల్లా, సతీష్ కుమార్, కృష్ణ యాదవ్, కైరుప్పల వరప్రసాద్, మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు ప్యాలకుర్తిలో పర్యటన

కోడుమూరు (రూరల్), మార్చి 7: మండలంలోని ప్యాలకుర్తికి శుక్రవారం నారా భువనేశ్వరి రానున్నారు. చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక మృతి చెందిన పార్టీ కార్యకర్తల కుటుంబాలను నిజం గెలవాలి పేరుతో ఆమె పరామర్శిస్తున్నారు. పర్యటనలో భాగంగా ప్యాలకుర్తిలో సీనియర్ నాయకుడు నాగార్జునగౌడ్ కుటుంబాన్ని పరామర్శిస్తారు. బాధిత కుటుంబానికి రూ.3 లక్షల చెక్‌ను భువనేశ్వరి అందజేస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి.


సుభాన్ పిల్లలకు చాక్లెట్లు అందిస్తున్న నారా భువనేశ్వరి


ఆస్పరిలో..

శివశివా... ఏమిటీ ప్రకటన..!

మహానంది ప్రసాదాల కవర్‌పై ప్రైవేట్ ప్రకటనలు



ప్రసాదం కవర్‌పై ఉన్న ప్రకటన

మహానంది, మార్చి 7: హిందూ ఆలయాల్లో ఇటీవలి కాలంలో కొందరు అధికారులు భక్తి భావాన్ని మరచి కమర్షియల్‌గా మారుతున్నారు. ఆలయ విశిష్టతను మంటగలిపేలా వ్యవహరిస్తున్నారు. ఇందుకు తార్కాణంగా నంద్యాల జిల్లా మహానంది ఆలయ అధికారుల నిర్వాకం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. మహానందిలో భక్తులకు అందించే లడ్డూ ప్రసాదాల కవర్లపై ప్రైవేట్ సంస్థకు చెందిన ప్రకటనలు ముద్రిస్తున్నారు. జీవీ మాల్ వస్త్ర దుకాణానికి సంబంధించిన ఓ వాణిజ్య ప్రకటన భక్తులకు ఇచ్చే ప్రసాదాల కవర్‌పై ముద్రించి ఇవ్వడం విమర్శలకు తావిస్తోంది. దీనిపై హిందువులు, హైందవ సంస్థలు అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నారు. తమ ప్రచారానికి దేవుళ్లను ఇలా కూడా వాడుకుంటారా? అన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా లడ్డూ కవర్లపై హైందవ సంస్కృతి గురించి తెలిపేలా సూచనలు, సంబంధిత ఆలయానికి చెందిన వివరాలు, పూజా కైంకర్యాలు తదితర అంశాలను పొందుపరుస్తారు. అలా కాకుండా మహానంది ఆలయం ఇలా ఓ ప్రైవేట్ సంస్థకు ప్రచారంగా మహానందీశ్వరుడి ప్రసాదాలను వినియోగించడంపై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డిని వివరణ కోరగా జీవీమాల్ వస్త్ర దుకాణం సంస్థ రూ.6 లక్షల వరకు ప్రసాదాల లడ్డూ, పులిహోర కవర్ల తయారికి సహకరించారని తెలిపారు. అందుకోసమే ఇలా ప్రసాదాల కవర్లపై ముద్రించామన్నారు. త్వరలోనే వాటిని భక్తులకు సరఫరా చేయడం నిలిపివేస్తామని వివరించారు.

ఏపీ పీజీ సెట్‌కు ఆర్‌యూ వీసీ

కర్నూలు(అర్బన్), మార్చి 7: ఏపీపీజీ సెట్ 2024 నిర్వాహక కమిటీ సభ్యుడిగా రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతి, ప్రొఫెసర్ బీ. సుధీర్ ప్రేమ్ కుమార్ నియమితులయ్యారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కే. హేమచంద్రారెడ్డి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఉన్న విద్యామండలి చైర్మన్, ముఖ్య కార్యదర్శి సభ్యులుగా ఉండే ఈ కమిటీకి సెట్ నిర్వాహక విశ్వవిద్యాలయమైన ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాదరెడ్డి అధ్యక్షుడిగా వ్యవహరించనున్నారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాంత విశ్వవిద్యాలయాల వీసీల నుంచి ఆర్‌యూ ఉపకులపతికి అవకాశం కల్పించారు. ఈ ఉత్తర్వులను అనుసరించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ విశ్వవిద్యాలయాలతో పాటు, అనుబంధ కళాశాలల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించనున్న ఏపీ పీజీ సెట్ 2024 విధి విధానాలకు సంబంధించి గురువారం ఆన్‌లైన్‌లో సమావేశం జరిగింది. సెట్ నోటిఫికేషన్ నుంచి వివిధ కోర్సులకు సంబంధించిన సిలబస్‌ను, ప్రశ్నపత్రాల నమూనా, అర్హతలు, పరీక్షా కేంద్రాలతోపాటు జూన్ 4 నుంచి 8 వరకు ఆన్‌లైన్‌లో పరీక్షల నిర్వహణలోని వివిధ అంశాలను చర్చించారు. దరఖాస్తు ఫీజు, మూల్యాంకనం, ర్యాంకుల కేటాయింపు మొదలైన విషయాల గురించి చర్చించారు. కమిటీ సభ్యులుగా ఎంపికైన ఉప కులపతిని రెక్టార్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ నాగుల అంకన్న, ప్రిన్సిపాల్ సీవీ కృష్ణారెడ్డి, డీన్‌లు వెంకటసుందరానంద పుచ్చా, విశ్వనాథరెడ్డి, భరత్‌కుమార్, వివిధ శాఖల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యాగంటిలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



యాగంటిలో ఉత్సవ విగ్రహాలకు పూజలు చేస్తున్న ఈవో, చైర్మన్

బనగానపల్లె, మార్చి 7 : బనగానపల్లె మండలంలోని యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఆలయ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ తోట బుచ్చిరెడి, ఆలయ ప్రధాన అర్చకుడు మహేశ్ శర్మ, కిశోర్, చిన్నస్వామి, ఆనందశర్మ ఆధ్వర్యంలో ఉదయం 5 గంటలకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ధ్వజారోహణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. మండలంలోని రామతీర్థం గ్రామంలో బుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో, పసుపుల గ్రామ సమీపంలో ఉన్న గుండం మల్లికార్జునస్వామి ఆలయంలో, పలుకూరు గ్రామంలోని రామేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

వైసీపీకి భారీ షాక్

పార్టీని వీడి 115 కుటుంబాలు టీడీపీలో చేరిక



బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన సుంకేసుల వాసులు

బనగానపల్లె, మార్చి 7: అవుకు మండలంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. గురువారం బనగానపల్లె పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో అవుకు మండలం సుంకేసుల గ్రామంలోని వైసీపీకి చెందిన 115 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వైసీపీకి చెందిన కైప వెంకటరామిరెడ్డి, కైప చంద్రశేఖర్‌రెడ్డి, మంచాల వీర ప్రతాప్‌రెడ్డి, సాధుకొట్టం శ్రీనివాసులరెడ్డి, వేములపాడు శివారెడ్డి, మంచాల భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీరాముల దేవదానం, క్రిష్టిపాడు వలి, బత్తుల మహేశ్, అర్జునాపురం సుబ్రమణ్యం, మద్దనపు రమణ, కోమటి గంగన్న, చాకలి పుల్లయ్య తదితర వైసీపీకి చెందిన కుటుంబాలు బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి. వీరికి బీసీ టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీసీ మాట్లాడుతూ సుంకేసుల గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

దేవనకొండ, మార్చి 7: చికిత్స పొందుతూ గురువారం ఓ రైతు మృతి చెందాడు. దేవనకొండ మండలం గుడిమిరిశ్ల గ్రామానికి చెందిన నల్లబోతుల నరసింహుడు (38) బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ రైతు నరసింహుడు గురువారం ఉదయం మృతి చెందాడు. నరసింహుడు తనకున్న 15 ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేశాడు. ఇందుకోసం రూ.60 లక్షల మేర అప్పులు చేశాడు. గతేదాది భూమిని కొంత మేర అప్పులు చెల్లించాడు. ఇంకా అప్పులు అలాగే ఉండటం, రుణదాతల నుంచి ఒత్తిళ్లు అధికంగా రావడంతో నరసింహుడు తీవ్ర ఒత్తిడికి లోనై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య సోమేశ్వరమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహానందిలో శివరాత్రి శోభ

- సూర్య ప్రభ వాహనంపై ఊరేగిన దేవదేవుడు
- నేడు లింగోద్భవ పూజలు



మహానందిలో సూర్య ప్రభ వావాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

మహానంది, మార్చి 7: మహానంది క్షేత్రం గురువారం మహా శివరాత్రి ఉత్సవ శోభ కనిపించింది. రాష్ట్రంలోని దేవాలయాల నుంచి తరలి వచ్చిన రుత్వికులతోపాటు ఆలయ వేదపండితులు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం యాగశాల మండపంలో హోమాలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను సూర్య ప్రభ వాహనంపై ఊరేగించారు. రాత్రి రావణ వాహన సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి దంపతులతో పాటు కూరగాయల దాత లక్కబోయిన ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మహానందిలో లింగోద్భవ పూజలు: బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టమైన లింగోద్భవ పూజలను శుక్రవారం రాత్రి 10 గంటల నుంచి ప్రధాన ఆలయంలో గర్భాలయంలో వేదపండితులు నిర్వహిస్తారు. లింగోద్భవ సమయంలో భక్తులకు దర్శనాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం తెల్లవారు జామున 3 గంటల నుంచి స్వామి, అమ్మవార్ల కళ్యాణం జరుపుతారు.

జీరో వ్యాపారంపై మహా చెక్ తనిఖీలు

- సెస్సు లక్ష్యాన్ని సాధిస్తాం: ఏడీఎం నారాయణమూర్తి

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 7: జీరో వ్యాపారాన్ని ప్రోత్సహిస్తున్న దళారులు, వ్యాపారులపై చర్యలు చేపట్టేందుకు మహా చెక్ పేరుతో తనిఖీలు నిర్వహించాలని నిర్ణయించినట్లు మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి తెలిపారు. గురువారం నగరంలోని మార్కెటింగ్ శాఖ ఏడీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 7మార్కెట్ కమిటీలకు మార్కెటింగ్ శాఖ కమిషనర్ సెస్సు లక్ష్యాలను సాధించేందుకు మహాచెక్ పేరుతో ఆకస్మిక తనిఖీలు చెక్‌పోస్టుల్లో నిర్వహించాలని ఆదేశించినట్లు వివరించారు. కర్నూలు మార్కెట్ కమిటీకి రూ.6.15 కోట్ల సెస్సును వసూలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కమిటీలో ఇప్పటికే రూ.6.51 కోట్ల సెస్సును సాధించారని తెలిపారు. ఆదోని మార్కెట్ కమిటీలో రూ.16.10 కోట్ల సెస్సును వసూలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అయితే రూ.11.95 కోట్ల సెస్సును మాత్రమే వసూలు చేసినట్లు ఏడీఎం తెలిపారు. ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీ నుంచి రూ.4.50 కోట్ల సెస్సును వసూలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా.. ఇప్పటికే రూ.5.18 కోట్ల సెస్సును సాధించినట్లు తెలిపారు. ఆలూరు మార్కెట్ కమిటీలో రూ.1.05 కోట్ల సెస్సు వసూలుకుగాను రూ.1.05 కోట్లు, పత్తికొండలో రూ.75 లక్షల సెస్సుకుగాను రూ.69.31 లక్షలు, కోడుమూరులో రూ.1.90 కోట్లకుగాను రూ.1.25 కోట్లు, మంత్రాలయంలో రూ.80 లక్షలకుగాను రూ.1.01 కోట్లు వసూలు చేశామన్నారు.

నల్లమల ఘాట్ రోడ్డులో ఆంక్షలు

- గూడ్స్ వాహనాల దారి మళ్లింపు
- పలుచోట్ల పోలీసు చెక్‌పోస్టుల ఏర్పాటు



నల్లమలలోని ఘాట్ రోడ్డులో నిలిచిన వాహనాలు (ఫైల్)

ఆత్మకూరు, మార్చి 7: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలానికి తరలి వెళ్లే గూడ్స్ వాహనాలపై పోలీసు, రవాణా శాఖలు పలు ఆంక్షలు విధించాయి. గతంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భాల్లో నల్లమల ఘాట్‌లో జరిగిన రోడ్డు ప్రమాద సంఘటనలు, ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని నల్లమల అటవీ ప్రాంతంలోని కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి మీదుగా గూడ్స్ వాహనాలపై నిబంధనలు అమలు చేశారు. ఆత్మకూరు మీదుగా దోర్నాల వైపు వెళ్లే గూడ్స్ వాహనాలు, భారీ వాహనాలను దారి మళ్లించి నంద్యాల టర్నింగ్, వెలుగోడు మీదుగా నంద్యాల, గిద్దలూరు నుంచి దారి మళ్లించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ నెల 9వ తేదీ వరకు ఈ నిబంధనలను ఇలాగే కొనసాగించనున్నట్లు ఆత్మకూరు అర్బన్ సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. కాగా శుక్రవారం ఉదయం నుంచి శ్రీశైలానికి వెళ్లే వాహనాలను పూర్తిగా నిలిపివేయనున్నారు. పాగాలంకరణ అనంతరం శ్రీశైలం నుంచి దోర్నాలకు వచ్చే వాహనాలు మినహాయిస్తే ఎదురుగా ఎటువంటి వాహనాలు రాకుండా ఈ నిర్ణయం తీసుకున్నారు. అవసరమైతే ట్రాఫిక్ పర్యవేక్షణాధికారుల ఆదేశాల మేరకు ఆర్టీసీ బస్సు సర్వీసులకు మాత్రమే శ్రీశైలం ఘాట్ రోడ్డులోకి అనుమతించనున్నారు. ఇప్పటికే ఆత్మకూరులోని నంద్యాల టర్నింగ్, బైర్లూటి వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ఘాట్ రోడ్డులోకి భారీ వాహనాలను అనుమతించకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. కాగా శుక్రవారం ఘాట్ రోడ్డులో వాహనాల రద్దీ మరింత పెరగనున్న నేపథ్యంలో రోళ్లపెంట ఘాట్ వద్ద కూడా పోలీసు సిబ్బందిని అందుబాటులో ఉంచి ఏదైనా ట్రాఫిక్ జామ్ తలెత్తితే సత్వరమే చర్యలు తీసుకునేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వాస్తవానికి నాగార్జునసాగర్-శ్రీశైలం అభయారణ్యం మీదుగా వెళ్లే కర్నూలు-గుంటూరు రహదారి సింగిల్ లైన్‌గా ఉంది. దీనికితోడు మలుపులతో కూడిన ఘాట్ రోడ్డు ప్రమాదకరంగా మారింది. పలు చోట్ల రక్షణగోడలు, ప్రమాద సూచికలు కూడా లేవు. ఈపరిస్థితుల్లో ఏదైనా ప్రమాదం సంభవిస్తే దారిపొడవునా వేలాది వాహనాలను దారిపొడవునా నిలిచిపోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. దీంతో పోలీసులు ఘాట్‌రోడ్డులో ఆంక్షలు విధించినట్లు తెలుస్తోంది.

భక్తులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

- నంద్యాల జిల్లా జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి
- బ్రహ్మోత్సవ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

శ్రీశైలం, మార్చి 7: శ్రీశైలంలో కొన్నసాగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలపై నంద్యాల జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అధికారులతో గురువారం సమీక్ష జరిపారు. ముందుగా ఆలయంలో ఏర్పాట్లు, భక్తుల సౌకర్యాలపై ఆయన క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. క్షేత్రంలో 12 సెక్టార్లలో జోనల్ అధికారులను నియమించి నిరంతరం భక్తుల సౌకర్యాలను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా పారిశుధ్యం, మంచినీటి సౌకర్యం, భక్తుల క్యూలైన్లపై ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆలయ అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీని ఎప్పటికప్పుడు అంచనా వేసి అందుకు తగ్గ ఏర్పాట్లు చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం మహాశివరాత్రి పర్వదినం రోజు రాత్రి పాగాలంకరణ ముఖ్యమైన ఘట్టమని, కార్యక్రమాన్ని భక్తులు వీక్షించేందుకు కిందిభాగంలో 4వేల మంది, మెట్ల మార్గంలో 750 మంది కూర్చుని వీక్షించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అలాగే ఎక్కడ ఏటువంటటి సమస్య వచ్చిన కమాండ్ కంట్రోల్ రూముకు సమాచారం అందేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మొబైల్ సిగ్నల్ సమస్య తలెత్తకుండా అధికారులందరికీ వైర్‌లెస్ సెట్లు ఇచ్చినట్లు జేసీ తెలిపారు.

రాష్ట్రంలో మొట్టమొదటి క్యాన్సర్ హాస్పిటల్

- బర్న్స్ వార్డు, పరీక్ష కేంద్రాలను ప్రారంభించిన ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన



క్యాన్సర్ ఆసుపత్రిని ప్రారంభిస్తున్న మంత్రి

కర్నూలు(హాస్పిటల్), మార్చి 7: ఎట్టకేలకు రాష్ట్రంలోనే మొట్టమొదటి ప్రభుత్వ క్యాన్సర్ హాస్పిటల్ ప్రారంభమైంది. గురువారం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రారంభించారు. దీంతో పాటు రూ.3.46 కోట్ల వ్యయంతో నిర్మించిన పది పడకల కాలిన రోగుల యూనిట్‌ను జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, రూ.3.22 కోట్లతో నిర్మించిన పరీక్ష కేంద్రాన్ని ఎమ్మెల్సీ డా.మధుసూదన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో మొట్టమొదటి పూర్తి స్థాయి క్యాన్సర్ హాస్పిటల్‌లో కర్నూలులో అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. కర్నూలు మెడికల్ కాలేజీ ఆధునికీకరణకు వందల రూ.కోట్లు, సిల్వర్ జూబ్లీ కాలేజీ, గాజులదిన్నె ప్రాజెక్టు ఆధునికీకరణ, నంద్యాలకు హైవే, కర్నూలు నగరానికి రూ.135 కోట్ల తాగునీటి పథకానికి ఖర్చు చేశామన్నారు. ఓ పక్క ఇంత అభివృద్ధి జరుగుతుంటే.. ప్రతిపక్ష పార్టీ నాయకులు మాత్రం అభివృద్ధి లేదని పేర్కొనడం అన్యాయమన్నారు. కొత్తగా స్టేట్ క్యాన్సర్ యూనిట్‌కు వైద్య సిబ్బంది పోస్టులు భర్తీ చేశామని తెలిపారు. క్యాన్సర్ హాస్పిటల్‌కు రూ.120 కోట్లు ఖర్చు పెట్టామని, ఇందులో రూ.36 కోట్లు భవన నిర్మాణానికి రూ.86 కోట్లు పరికరాలు, ఒక లినియర్ ఆక్సిలేటర్‌కు రూ.54 కోట్లు వెచ్చించామని వెల్లడించారు. కార్యక్రమంలో కలెక్టర్ డా.జి.సృజన, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకట రంగారెడ్డి, ప్రిన్సిపాల్ చిట్టి నరసమ్మ, డిప్యూటీ సూపరింటెండెంట్ డా.ప్రభాకర్ రెడ్డి, సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో హేమనళిని పాల్గొన్నారు.

స్టేట్ క్యాన్సర్ యూనిట్ పనులపై మంత్రి ఆగ్రహం

స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ నిర్మాణ పనులు సరిగా చేయకపోవడంతో ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్ల అధికారులపై ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కర్నూలు జీజీహెచ్ ఆవరణలో స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభోత్సవం సందర్భంగా సర్జికల్ అంకాలజీ వార్డులో ప్లాస్టింగ్ సరిగా చేయలేదని మండిపడ్డారు. కిటికీలు కూడా సరిగ్గా వేయలేదని, వర్షపు నీరు వస్తే బయటకు ఎలా వస్తాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మొదటి అంతస్థులో నిర్మాణం చేసిన గ్రానైట్ ఫ్లోరింగ్ సరిగ్గా లేదని ఏపీఎంఎస్ఐడీసీ ఈఈపై మండిపడ్డారు. హాలులో బ్లాక్ గ్రానైట్ మధ్యలో ఎలా వేస్తారని, ఇది మరోచోట వేసి ఉండాల్సిందని అన్నారు.

దోపిడీ పాలనను తరిమి కొట్టండి

కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

డోన్, మార్చి 7: రాష్ట్రంలో దోపిడీ పాలన సాగిస్తున్న వైసీపీని రాష్ట్రం నుంచి తరిమి కొట్టాలని కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం డోన్ పట్టణంలోని, 2, 9, 12 వార్డులలో ఆయన పర్యటించారు. వార్డుల్లో మహిళలు కోట్లకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని లూటీ చేశారని ధ్వజమెత్తారు. మద్య నిషేధం చేస్తానని చెప్పిన సీఎం జగన్ మాట తప్పారని, కల్తీ మద్యం విక్రయిస్తూ వేల కోట్లు సంపాదించారని ఆరోపించారు. ఉచితంగా లభించే ఇసుకను బ్లాకులో విక్రయిస్తూ ప్రజలను నిలువదోపిడీ చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు, రైతులు, నిరుద్యోగులు, కార్మికులకు వైసీపీ పాలనలో తీరని అన్యాయం జరిగిందన్నారు. బీసీ కార్పొరేషన్లను ఆర్భాటంగా ఏర్పాటు చేసి పైసా నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేశారని విమర్శించారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు బీసీ డిక్లరేషన్‌లో బీసీల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. చంద్రబాబు హయాంలో దళితుల సంక్షేమానికి అమలు చేసిన 29 పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసి తీరని అన్యాయం చేసిందన్నారు. దోపిడీ పాలన చేస్తున్న వైసీపీకి బుద్ధి చెప్పి మంచి విజన్ ఉన్న చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం కొండపేటలోని దర్గాలో కోట్ల ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోట్రికే ఫణిరాజ్, వలసల రామక్రిష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మీరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, మద్రి రమణ, శ్రీనివాసులు యాదవ్, మద్దయ్య గౌడు, భాస్కర్ నాయుడు, సుధీష్, అన్వర్ బాషా, మనోహర్, చంద్రపల్లి ఆచారి, ఎల్లగౌడు, రఘు, ఆర్ఈ నరసింహ, గురుస్వామి యాదవ్ పాల్గొన్నారు.

మిర్చి రైతులకు న్యాయం చేయండి..



మిర్చి ప్లాట్‌ఫారం వద్ద ధర్నా చేస్తున్న ఏపీ రైతు సంఘం నేతలు

కర్నూలు (అగ్రికల్చర్), మార్చి 7: కర్నూలు మార్కెట్ యార్డులో దశాబ్ద కాలంగా మిర్చి రైతులను వ్యాపారులు అక్రమాలతో ముంచెత్తుతున్నారని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం ఆరోపించారు. గురువారం నగరంలోని మార్కెట్ యార్డు ప్రాంగణంలో మిర్చి ప్లాట్‌ఫారం వద్ద రైతులకు సంఘీభావం తెలుపుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి సురేంద్ర యాదవ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న జగన్నాథం మాట్లాడుతూ 20 రోజులుగా ఎండు మిర్చి ధర భారీగా తగ్గిపోవడానికి కారణం వ్యాపారులు సిండికేట్‌గా మారడమేనని ఆరోపించారు. క్వింటం 24వేల నుంచి 22 వేల దాకా ఉన్న ధర ప్రస్తుతం రూ.8 వేల నుంచి రూ.5 వేలకు పడిపోయిందన్నారు. ఎకరాకు మిర్చి పంట సాగు కోసం రైతు రూ.2 లక్షల దాకా ఖర్చు పెడుతున్నారని, కనీసం పది క్వింటాళ్ల దిగుబడి వచ్చినా రూ.లక్ష మాత్రమే రైతుల చేతికి అందే అవకాశం ఉందని అన్నారు. దీని వల్ల రైతులకు అప్పులు తప్ప మిగిలిందేమీ లేదని అన్నారు. ప్రభుత్వం స్పందించి క్వింటానికి రూ.25వేల ధర అందించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్రయ్య, రామక్రిష్ణ, రాజాగౌడు, శ్రీనివాసులు, పంపన్నగౌడు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ అనంత్‌బాబును పదవి నుంచి తొలగించాలి

మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి డిమాండ్

కర్నూలు(కల్చరల్), మార్చి 7: ఎమ్మెల్సీ అనంత్‌బాబును పదవి నుంచి తొలగించాలని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారూఖ్ శిబ్లీ డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్‌లో సమతా సైనిక్‌దళ్, మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శిబ్లీ మాట్లాడుతూ 2022 మే 19న అనంత్‌బాబు దగ్గర డ్రైవర్‌గా పని చేస్తున్న దళిత యువకుడు సుబ్రహ్మణ్యంను అతి కిరాతకంగా చంపి, తన కారులోనే తీసుకెళ్లడం చాలా దారుణమని అన్నారు. వైసీపీ ప్రభుత్వం అండదండలతో పోలీసు వ్యవస్థను మేనేజ్ చేస్తూ శిక్ష నుంచి తప్పించుకునేందుకు కుట్ర చేస్తున్న అనంతబాబుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారురు. ఇప్పటికే హైకోర్టు తీర్పు ఇచ్చినా అతనిపై చార్జిషీట్ ఎందుకు ఫైల్ చేయలేదని ప్రశ్నించారు. తక్షణమే అతనిని ఎమ్మెల్సీ పదవి నుంచీ తప్పించి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో దళ్ రాయలసీమ అధ్యక్షుడు సి. రంగయ్య, జిల్లా అధ్యక్షుడు మల్లేశ్ పాల్గొన్నారు.

రసాయన ప్రమాదాల స్థాయిని తగ్గించవచ్చు

డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఐ. నారాయణరెడ్డి

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 7: సహజ, మానవ నిర్మిత విపత్తులతో పాటు కెమికల్ డిజాస్టర్స్ నివారణపై విపత్తుల సంస్థ దృష్టి సారించిందని, దీనిపై ముందస్తు అవగాహన కార్యక్రమాలు, జాగ్రత్త చర్యలతో పాటు ప్రణాళికలు రూపొందించడం వలన రసాయనిక ప్రమాదాల స్థాయిని తగ్గించుకోవచ్చని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఐ. నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం కర్నూలు మండలం గొందిపర్ల గ్రామంలోని టీజీవీ రాయలసీమ ఆల్కలీస్ అలైడ్ కెమికల్స్ లిమిటెడ్ ఫ్యాక్టరీలో కెమికల్ ఎమర్జెన్సీ మాక్ ఎక్సర్‌సైజ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీసు, ఆరోగ్య, రవాణా శాఖ ఎస్‌డీఆర్ఎస్, ఏపీఎస్పీఆర్ఎస్, కాలుష్య నియంత్రణ మండలి విభాగాలతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ మాక్ ఎక్సర్‌సైజ్‌లో భాగంగా టీజీవీ రాయలసీమ ఆల్కలీస్ అలైడ్ కెమికల్స్ లిమిటెడ్ ఫ్యాక్టరీలో రసాయనిక ప్రమాదం జరిగితే ఎలా ప్రతిస్పందించి చర్యలు తీసుకునేదీ ప్రత్యక్షంగా చూపించారు. మాక్ ఎక్సర్‌సైజ్ వల్ల కెమికల్ డిజాస్టర్స్ జరిగినప్పుడు ఏ విధంగా కర్మాగారాల యజమాన్యం, జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా సత్వరంగా చర్యలు తీసుకుంటాయని ఐ. నారాయణరెడ్డి తెలిపారు. కర్నూలు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగ ప్రసన్న లక్ష్మి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి అవినాశ్ జయసింహ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డీపీఎం అనుపమ కాలుష్య నియంత్రణ అధికారి మునిప్రసాద్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ శ్రీధర్ పాల్గొన్నారు.

భారీగా నాటు సారా ఊట ధ్వంసం

కర్నూలు(అర్బన్), మార్చి 7: భారీగా నాటు సారా ఊటను, సారా బట్టీలను ధ్వంసం చేశామని సెబ్ సీఐ కేఆర్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. గురువారం ఓర్వకల్లు మండలం పరిధిలోని గుమితం తండాలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, డీటీఎఫ్ సీఐ నరసనాయుడు ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు చేశారు. 1700 లీటర్ల బెల్లం ఊట, 40 లీటర్ల నాటు సారాను గుర్తించామని తెలిపారు. ఎం. శ్రీనివాసులుపై కేసు నమోదు చేశామని, ఈ దాడుల్లో ఎస్ఐలు సీ. రెహనాబేగం, సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

మల్లన్న భక్తులకు ఎస్పీ సూచనలు

నంద్యాల క్రైం, మార్చి 7: శ్రీశైలం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు వెళ్లే భక్తులకు నంద్యాల ఎస్పీ పలు సూచనలు చేశారు. గురువారం ఆయన నంద్యాలలో విలేకరులతో మాట్లాడుతూ దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి మల్లన్న దర్శనార్థం శ్రీశైలానికి వచ్చే భక్తులు తమ ఫోర్ వీలర్ వాహనాలకు అనుభవం ఉన్న డ్రైవర్లను సమకూర్చుకోవాలన్నారు. అనుభవంలేని డ్రైవర్ల మూలంగా వాహనాల క్లచ్ ప్లేట్లు పోయి ప్రయాణం మధ్యలో ఆగిపోయే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా ఘాట్ రోడ్డులో వాహనాలను ఓవర్‌టేక్ చేయకూడదన్నారు. అలాగే ఓవర్ లోడ్‌తో ఘాట్‌రోడ్డులో ప్రయాణించ కూడదన్నారు. మోటార్ సైకిళ్లపై వెళ్లే భక్తులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాలను ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయవద్దని సూచించారు. పోలీసులు సూచించిన పార్కింగ్ ప్రదేశాల్లోనే వాలనాలను నిలపాలన్నారు. సాక్షిగణపతి వద్దకు కాలినడకన వెళ్లి దర్శనం చేసుకోవాలని, వాహనాలను నిలిపి దర్శనం చేసుకోవద్దని సూచించారు. తినుబండారాలు, బొమ్మలు, ఆటవస్తువులు, పూజాసామగ్రి అమ్మేవారు ఘాట్ రోడ్డులో ఎక్కడా ఉండకూడదన్నారు. మహాశివరాత్రి రోజు రాత్రి 9గంటల నుంచి ఉదయం వరకు దోర్నాల నుంచి పైకి శ్రీశైలం వైపు ఎటువంటి వాహనాలు అనుమతించబోమని స్పష్టం చేశారు. పాతాళగంగ ఘాట్ల దగ్గర స్నానం ఆచరించే భక్తులు ఎలాంటి ప్రమాదాలకు గురికాకుండా గత ఈతగాళ్లను నియమించామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వాహనాలను ఏపీఎస్‌ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన వాహనాలను మేకలబండ వెనుక ప్రాంతంలో, టూరిస్టు వాహనాలను మేకలబండ పక్కన గల ఖాళీ స్థలంలో పార్కింగ్ చేసుకోవాలని ఎస్పీ సూచించారు. కార్లు ఆలయం వెనుక భాగంలో, ఓల్డ్ హెలిప్యాడ్, స్కూల్, నిత్యాన్నదాన సత్రం పక్కన పార్కింగ్ చేసుకోవాలని సూచించారు.

సంగమేశ్వరానికి ప్రత్యేక బస్సులు

కొత్తపల్లి, మార్చి 7: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని సప్తనదుల సంగమేశ్వరం, కొలనుభారతి పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు ఆత్మకూరు ఆర్టీసీ బస్సు డిపో మేనేజర్ మహేంద్రుడు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ శుక్ర, శనివారాల్లో సంగమేశ్వరానికి ఆరు బస్సులు, కొలను భారతి పుణ్యక్షేత్రానికి నాలుగు బస్సులు భక్తుల సౌకర్యార్థం బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. రద్దీని బట్టి మరిన్ని బస్సులు కూడా నడుపుతామని చెప్పారు.

ఘనంగా మహిళా దినోత్సవం

నంద్యాల (కల్చరల్), మార్చి 7: నంద్యాలలోని బాల అకాడమీలో, శ్రీశైల పబ్లిక్ స్కూల్‌లో నంది రైతు సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మహిళా సదస్సు నిర్వహించారు. సదస్సులో మహిళాభ్యుదయం, దేశ ప్రగతిలో మహిళల పాత్ర తదితర అంశాలపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఆర్ఎఆర్ఎస్ శాస్త్రవేత్తలు డాక్టర్ లక్ష్మీ కళ్యాణి, డాక్టర్ పుల్లి బాయి, నంది రైతు సమాఖ్య ప్రతినిధులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలో గురువారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేక్ కట్ చేసి వేడుకలు చేసుకున్నారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, సీపీఎం కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు.

నందికొట్కూరు: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని నందికొట్కూరు సీనియర్ న్యాయాధికారి ఇందిరాప్రియదర్శిని మహిళలకు పిలుపునిచ్చారు. ఈనెల 8న జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఒక్క రోజు ముందుగా పట్టణంలోని లీగల్ సర్వీస్ కమిటీ హాలులో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మహిళలు న్యాయమూర్తితో కేక్ కట్ చేయించారు. అలాగే జైకిసాన్ పార్కులో



నందికొట్కూరులో కేక్ కట్ చేస్తున్న సీనియర్ న్యాయాధికారి ఇందిరా ప్రియదర్శిని

మున్సిపల్ కార్యాలయ సిబ్బంది మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు.

పగిడ్యాల: పగిడ్యాల వెలుగు కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఉద్యోగుల, పొదుపు సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం: మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాల, ఫార్మసీ కళాశాలలో వేడుకలు నిర్వహించారు.

'రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్'



ఇస్కాల గ్రామంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

పాములపాడు, మార్చి 7: ఒక్కచాన్స్ అంటూ ప్రజలకు అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చి వైఎస్ జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య అన్నారు. మండలంలోని ఇస్కాల గ్రామంలో టీడీపీ నాయకులు నాగలక్ష్మిరెడ్డి, లింగస్వామి, కలీముల్లా, శ్రీనివాసరెడ్డి, తిక్కస్వామి, చిన్న వెంకటరెడ్డితో కలసి గురువారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, తిమ్మారెడ్డి, బండ్లమూరి చంద్రశేఖర్, గోవిందు, పూసల కృష్ణ హఫీజ్, సత్యంరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, యేసేపు, అలీసాహెబ్, స్వాములు, మల్లీశ్వరరెడ్డి, శ్రీను, కేశవులు, రమణ, స్వామన్న, రాముడు, కృష్ణుడు, లింగస్వామి, కార్యకర్తలు పాల్గొన్నారు.

'నిరుద్యోగులను మోసం చేసిన సీఎం'

పాణ్యం, మార్చి 7: నిరుద్యోగులను సీఎం జగన్‌రెడ్డి నమ్మించి మోసం చేశారని రాయలసీమ విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ నాయకులు సురేంద్ర ఆరోపించారు. పాణ్యంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం నిరుద్యోగ గర్జన పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన కర్నూలు నగరంలోని దేవి ఫంక్షన్ హాల్‌లో జరిగే నిరుద్యోగ గర్జనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ లీగల్ సెల్ కార్యదర్శి రామ్మోహన్‌నాయుడు, నాయ కులు శేఖర్, రాజా, సతీష్, సురేష్, సునీల్, మురళి, సుబ్బయ్య, రాజు పాల్గొన్నారు.

97,254 మంది మహిళలకు లబ్ధి: కలెక్టర్



లబ్ధిదారులకు జంబో చెక్కును అందజేస్తున్న కలెక్టర్ తదితరులు

నంద్యాల (కల్చరల్), మార్చి 7: వైఎస్సార్ చేయూత పథకం కింద జిల్లాలో 97,254 మంది మహిళలకు నాలుగో విడత ఆర్థిక సాయంగా రూ.182.35 కోట్లు జమ చేశామని కలెక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు. గురువారం అనకాపల్లి జిల్లా కశింకోట మండలం పిసినికాడ నుంచి సీఎం జగన్ వైఎస్సార్ చేయూత పథకం కింద నగదు జమ చేసే కార్యక్రమాన్ని బటన్ నొక్కి ప్రారంభించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్‌తో పాటు ప్రభుత్వ మైనారిటీ సలహాదారులు హబీబుల్లా, హస్త కళల డైరక్టర్ సునీత అమృతరాజ్, బెస్త సంక్షేమ సంఘం డైరక్టర్ చంద్రశేఖర్, ఏపీఎస్పీడీసీఎల్ డైరక్టర్ శశికళ రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, లబ్ధిదారులు వీక్షించారు. అనంతరం లబ్ధిదారులకు జంబో చెక్కును అందజేశారు.

చుక్కల దుప్పి మృతి

ఆత్మకూరు రూరల్, మార్చి 7: నాగలూటి రేంజ్ పరిధిలోని కర్నూలు గుంటూరు రహదారిలో మంగళవారం రాత్రి పోతురాజు పెంట ప్రాంతంలో ఓ గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో చుక్కల దుప్పి మృతి చెందిందని నాగలూటి ఫారెస్ట్ రేంజర్ దొరస్వామి తెలిపారు. నాగలూటి రేంజ్‌లో యూడీ ఓఆర్ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేజీ రోడ్డు వెంట అటవీ మార్గంలో పల్లె కట్ట ప్రదేశం నుంచి దోర్నాల వరకు 30 కి.మీ. మించి వేగంతో వాహనాలు వెళ్లకూడదని ఆదేశించారు.

'ముస్లింల ద్రోహి సీఎం జగన్'




మాట్లాడుతున్న మైనార్టీ హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఫారూఖ్ సిబ్లీ

ఆత్మకూరు, మార్చి 7: సీఎం జగన్ ముస్లిం, మైనార్టీల ద్రోహి అని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు ఫారూఖ్ సిబ్లీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆత్మకూరులో నూతనంగా నిర్మించిన షాదీఖానాను గురువారం ఆయన పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. అసలు వంటగదులు, మరుగుదొడ్లు, వధూవరుల గదులు, కనీసం తాగునీరు లేకుండానే షాదీఖానాను నిర్మించడం విడ్డూరంగా ఉందన్నారు. కేవలం ముస్లిం మైనార్టీలను మరోసారి మోసగించేందుకే ఎన్నికల ముందు షాదీఖానాను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రారంభించారని విమర్శించారు. నిజానికి షాదీఖానా నిర్మాణానికి టీడీపీ హయంలో నిధులను మంజూరు చేస్తే అదేదో తామే చేసినట్లు తప్పుడు ప్రచారం చేసుకోవడం వైసీపీ నాయకులకే దక్కిందని మండిపడ్డారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నజీర్‌అహ్మద్, టీడీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు కలీముల్లా, నాయకులు శిరివెల్ల రజాక్, అబ్దుల్లాపురం బాషా, హిదాయతుల్లా, ఖలీలుల్లా ఖాన్, ఆర్టీసీ జబీవుల్లా, న్యామత్, ఖాజా, రఫీక్, అలిషేర్, జిలానీ, గౌండ మున్నా, అమ్మల్లా, అన్వర్, నబిరసూల్, ముత్తు, అలిహుసేన్, ఫక్రుద్దీన్, కొయ్య మున్నా, గౌస్, మోమిన్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

భీముని కొలనులో అపశ్రుతి

● కొండ దిగే క్రమంలో కింద పడి మహిళకు తీవ్ర గాయాలు

ఆత్మకూరు, మార్చి 7: శ్రీశైలానికి కాలి నడకన బయలు దేరిన ఓ మహిళ భక్తురాలికి గురువారం భీముని కొలనులో అపశ్రుతి చోటు చేసుకుంది. పెచ్చేరువు నుంచి భీమునికొలనుకు చేరుకున్న ఓ మహిళ భక్తురాలు భీముని కొలను దిగే క్రమంలో కింద పడి పడి తీవ్రంగా గాయపడ్డారు. దీంతో ఆమె భీముని కొలను నుంచి కైలాస ద్వారానికి చేరుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఆమె వెంట వచ్చిన సహచరులు కైలాస ద్వారానికి చేరుకుని అటవీ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు భీముని కొలనుకు చేరుకుని అక్కడి నుంచి అతి కష్టం మీద దుప్పటితో ఏర్పాటు చేసిన డోలి ద్వారా కైలాస ద్వారానికి మోసుకుంటూ తీసుకు వచ్చారు. అక్కడికి చేరిన బాధిత మహిళను 108 అంబులెన్సు ద్వారా శ్రీశైల దేవస్థానంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు అక్కడి వైద్యులు వైద్యసేవలు అందిస్తున్నారు. బాధిత మహిళ వివరాలు తెలియాల్సి ఉంది.



నేడు మహా శివరాత్రి

నంద్యాల (కల్చరల్), మార్చి 7: శివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకొని నంద్యాల పట్టణంలోని పలు ఆలయాలను ముస్తాబు చేశారు. శుక్రవారం రాత్రి లింగోద్భవ కాలం తర్వాత శివపార్వతుల కల్యాణం నిర్వహించడానికి నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సంజీవనగర్ రామాలయంలో భగవత్ సేవా సమాజ్ కమిటీ, ఆలయాల ఈవోలు లక్ష్మీనారాయణ, రామాంజనేయశర్మ ఆధ్వర్యంలో శివరాత్రికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నవనందులలో ప్రథమ నంది, నాగనంది, సోమనందీశ్వరాలయాలు, భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయం, సంజీవనగర్ రామాలయం, నాగులకుంటలోని నాగలింగేశ్వరాలయం, టెక్కె నాగులకట్ట అభయాంజనేయ స్వామి దేవాలయం శివరాత్రి వేడుకలకు ముస్తాబయ్యాయి.

కొత్తపల్లి: మండలంలోని సంగమేశ్వర ఆలయం శివరాత్రి వేడుకలకు ముస్తాబైంది. ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ, దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. 9న ఉదయం 11 గంటల నుంచి కల్యాణం నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

గడివేముల: దుర్గా భోగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. గడిగ రేవులలో దుర్గాభోగేశ్వర ఉత్సవ విగ్రహాలను గ్రామో త్సవం నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను నంది వాహనం మీద దుర్గాభోగేశ్వర ఆలయానికి తీసుకెళ్లారు. ఆలయ చైర్మన్ సునీల్‌కుమార్ రెడ్డి, ఆలయ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

'బకాయిల వసూళ్లపై దృష్టి సారించండి'

నంద్యాల రూరల్, మార్చి 7: నంద్యాల డివిజన్ పరిధిలోని విద్యుత్ బకాయిలపై దృష్టి సారించాలని విద్యుత్ శాఖ డైరెక్టర్ టెక్నికల్ సుబ్బరాజు సూచించారు. గురువారం నంద్యాల విద్యుత్‌శాఖ డివిజన్ కార్యాలయంలో ఏడీఏ, ఏఈలతో ఆయన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఈ రమణా రెడ్డి, ఏడీఈలు అంథోనిరాజు, సతీష్‌కుమార్‌రెడ్డి, సబ్ డివిజన్ ఏఈలు రామయ్య, నాగరాజు, రవికుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కల్యాణానికి ముత్యాల తలంబ్రాలు

మహానంది, మార్చి 7: మహానందిలో శివరాత్రి పురష్కరించుకొని శుక్రవారం తెల్లవారుజామున జరిగే స్వామి, అమ్మవార్ల కల్యాణానికి హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాసగౌడ్ కిలో ముత్యాలను గురువారం మహానందికి పంపించారు. వీటిని ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి దంపతులు యాగశాల మంటపంలో వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంత్‌శర్మకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



















టీడీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం

కోట్ల రాఘవేంద్రరెడ్డి



మాట్లాడుతున్న కోట్ల రాఘవేంద్రరెడ్డి

డోన్, మార్చి 7: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి తనయుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి అన్నారు. గురువారం డోన్ పట్టణంలోని కొత్తపేటలో కోట్ల రాఘవేంద్రరెడ్డి పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కోట్ల రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని గాలికొదిలేసి కక్ష సాధింపు రాజకీయాలకు ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలకు అన్యాయం చేసిందని ధ్వజమెత్తారు. చంద్రబాబు ప్రకటించిన టీడీపీ మేనిఫెస్టో మహిళలకు, యువతకు, రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు భరోసా కల్పించారన్నారు. రాబోవు ఎన్నికల్లో వైసీపీని ఓడించి టీడీపీ జనసేన కూటమిని గెలిపించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్రికే ఫణిరాజ్, టీడీపీ నాయకులు ఓబులాపురం శేషిరెడ్డి, మర్రి రమణ, ఓంప్రకాష్, మర్రిమణి, ఎరుకల చెర్వు శివ, చిట్యాల రఘు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన బీజేపీ నాయకుడు

డోన్, మార్చి 7: డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సమక్షంలో బీజేపీ నాయకులు సంతోష్ టీడీపీలో చేరారు. గురువారం పట్టణంలోని 2వ వార్డులో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కోట్ల సూర్య ప్రకాష్‌రెడ్డి సంతోష్ ఇంటికి వెళ్లి మద్దతు కోరారు. దీంతో సానుకూలంగా స్పందించిన బీజేపీ నాయకుడు కోట్లకు మద్దతు తెలిపి టీడీపీలో చేరారు. టీడీపీ చంద్రబాబు నాయకత్వం రాష్ట్రానికి ఎంతో అవసరం ఉందని ఈ సందర్భంగా కోట్ల అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుధీష్, ఓంప్రకాష్, రవి, అజీజ్ పాల్గొన్నారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

కోవెలకుంట్ల, మార్చి 7: కోవెలకుంట్ల ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రమాదేవి అధ్యక్షతన ఎంపీడీవో సయ్యదున్నీసా ఆధ్వర్యం లో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం మొ క్కుబడిగా సాగింది. ఈసమావేశంలో అన్నిశాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. విద్యుత్ ఏఈ రామ్మోహన్ మాట్లాడుతుండగా వల్లంపాడు సర్పంచ్ గార్లపాటి జగదీశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ కత్తి సురేశ్‌బాబులు కలుగ చేసుకొని ప్రస్తుతం వ్యవసాయానికి 9గంటలు విద్యుత్ ఇస్తున్నామని చెప్పి 7 గంటలే ఇస్తున్నారని నిలదీశారు. దీంతో బోర్లకింద సాగు చేసిన పంటలకు నీరు సరిగా అందక ఎండిపోతున్నాయని, 9 గంటలు కరెంట్ ఇచ్చి ఆదుకోవాలన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి సమస్య పరిష్కరిస్తామని ఏఈ సమాధానమిచ్చారు. ఎంఈవోలు వెంకటరామిరెడ్డి, వెంకటసుబ్బయ్య, వ్యవసాయాధికారి నిరంజన్, పశువైద్యాధికారి నిరంజన్, ఏపీవో శ్రీవిద్య, ఏపీఎం గురుస్వామి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

'ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి'

రుద్రవరం, మార్చి 7: ఆర్యవైశ్యులు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, అలాగే అన్ని రంగాల్లో రాణించాలని ఆర్యవైశ్యుల సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడు భవనాశి శ్రీనివాస్, జిల్లా తొలి అధ్యక్షుడు భవనాశి నాగమహేశ్ అన్నారు. రుద్రవరంలో నిర్మించిన ఆర్యవైశ్య కల్యాణ మండపాలను గురువారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు ఐకమత్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కళ్యాణ మండపానికి రూ.7.60లక్షలు అందించిన నల్లగట్ల వెంకటేశ్‌ను మెమెంటో, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్యాంసుందర్‌లాల్ గుప్తా, ఎల్‌వీ రంగనాయకులు, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్యాపిలి, మార్చి 7: బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నేరేడుచెర్ల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వ్యవసాయ సహకార బ్యాంకును ఆయన పారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, బోరెడ్డి శ్రీరామిరెడ్డి, మెట్టు వెంకటేశ్వరరెడ్డి, సీమ సుధాకర్‌రెడ్డి, శ్యాంరెడ్డి, బాలయ్య, అనీల్, చంద్రశేఖర్‌రెడ్డి, రాచెర్ల రామచం ద్రారెడ్డి, సహకార బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

మోటారు సైకిల్ ఢీకొని వ్యక్తి మృతి

బనగానపల్లె, మార్చి 7: మండలంలోని పండ్లాపురం గ్రామ సమీపంలో మోటారు సైకిల్ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని మిట్టపల్లె గ్రామానికి చెందిన బ్రహ్మానందరెడ్డి (45) పండ్లాపురం గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం మోటారు సైకిల్‌ను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందగా, జగదీశ్వర్‌రెడ్డికి గాయాలయ్యాయి. బ్రహ్మానందరెడ్డి మృతదేహాన్ని బనగానపల్లె ప్రభుత్వవైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జగన్‌కు కౌంట్ డౌన్: మాజీ ఎమ్మెల్యే బీసీ

కోవెలకుంట్ల, మార్చి 7: పన్నులు పెంచి, నిత్యావసర వస్తువుల ధరలు పెంచి ప్రజల రక్తాన్ని జలగల్లా పీల్చేస్తున్న సీఎం జగన్‌కు కౌంట్ డౌన్ ప్రారంభం అయిందని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం కోవెలకుంట్ల పట్టణంలోని బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి టీడీపీ సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. బీసీ మాట్లాడుతూ ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని సీఎం జగన్ చెబుతోంటే మరో వైపు ప్రజలు కూడా జగన్, వైసీపీ నాయకులను ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. జగన్ అహంకారానికి వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలికేందుకు రైతులు, యువత ప్రభుత్వ ఉద్యోగులు అందరూ సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఇంటి పట్టాలను పేదలకు ఇవ్వకుండా వైసీపీ తొత్తులకు ఇచ్చి అర్హులైన వారికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తీవ్ర అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. కోవెలకుంట్ల పట్టణంలో ఇళ్లులేని వారు చాలా మంది ఉన్నా వారికి ఇవ్వకుండా ఒకే వర్గానికి కొమ్ము కాస్తూ వైసీపీ నాయకులు, కార్యకర్తలు పంచుకొని పేదలను మోసం చేశారని విమర్శించారు. ఈ అసమర్థ సీఎం జగన్ వల్ల నష్టపోయిన రైతులు, నిరుద్యోగ యువకులు, మహిళలు టీడీపీకి స్టార్ కాంపెయినర్‌లుగా ఉంటారన్నారు. కార్యక్రమంలో బీసీ రామనాథరెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, గడ్డం నాగేశ్వరరెడ్డి, గడ్డం అమరనాథరెడ్డి, మురళి, జనసేన పార్టీ నాయకులు నాగప్రసాద్, కిట్టు, సురేశ్ పాల్గొన్నారు.



సూపర్‌సిక్స్ కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీసీ జనార్దన్‌రెడ్డి

దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ

బనగానపల్లె: బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి దాతృత్వాన్ని చాటుకున్నారు. గురువారం నిరుపేద దివ్యాంగులకు టీడీపీ కార్యాలయంలో ట్రైసైకిళ్లు సొంత నిధులతో పంపిణీ చేశారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా బనగానపల్లె నియోజకవర్గంలో బీసీ పర్యటించారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా పలువురు దివ్యాంగులు తమకు ట్రైసైకిళ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. దీంతో బీసీ జనార్దన్‌రెడ్డి ట్రైసైకిళ్లు ఇస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ మేరకు గురువారం బనగానపల్లె పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సొంత నిధులతో 12 మంది దివ్యాంగులకు ఉచితంగా ట్రైసైకిళ్లు బీసీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ఏకష్టం వచ్చినా ఆదుకుంటామన్నారు. తమకు ట్రైసైకిళ్లు పంపిణీ చేసిన బీసీ జనార్దన్‌రెడ్డికి దివ్యాంగులు కృతజ్ఞతలు తెలిపారు.

కమీషన్లు తీసుకోవడమే వైసీపీ లక్ష్యం: మాజీ మంత్రి

శిరివెళ్ల, మార్చి 7: ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని గ్రామాల్లో వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పది శాతం పనులు చేసి వాటి ద్వారా వంద శాతం కమీషన్లు తీసుకోవడమే ధ్యేయంగా వ్యవహరిస్తున్నారని టీడీపీ మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ఆరోపించారు. శిరివెళ్లలోని 100, 101వ బూత్ లలో గురువారం పర్యటించి టీడీపీ మినీ మేనిఫెస్టోలోని సూపర్-6 సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం అఖిలప్రియ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలు తాగునీటి సమస్యతో సతమతమవుతుంటే ఎమ్మెల్యే మాత్రం ప్రారంభోత్సవాల్లో తలమునకలయ్యాడని విమర్శించారు. టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, యామా గుర్రప్ప, సూరా రామ, బీసీ ఖాజా హుసేన్, సినిమా హాల్ కరీం, జాఫర్, బీసీ ఫిదా హుసేన్, బీఎండీ రఫి, అబూబకర్ సిద్ధిఖ్, ఉస్మాన్ బాషా, పీపీ లింగమయ్య, బాలచంద్రుడు, జిక్రియా, యూనుస్, షఫివుల్లా, వెంకటసుబ్బయ్య అహ్మద్‌బాషా పాల్గొన్నారు.



ప్రజలకు పథకాల గురించి వివరిస్తున్న భూమా అఖిలప్రియ

శివరాత్రికి ఆలయాలు ముస్తాబు



రుద్రవరం మండలం వాసాపురంలో ముస్తాబైన శివాలయం, చాగలమర్రిలో..

రుద్రవరం, మార్చి 7: రుద్రవరం మండలంలో మహాశివరాత్రికి శివాలయాలను ఆలయ నిర్వాహకులు ముస్తాబు చేశారు. మండలంలోని వాసాపురంలో రుద్రవరం భాస్కర నందీశ్వర ఆలయం, ఎల్లావత్తుల శివాలయం, చందలూరులో శివాలయం ఇంకా పలు గ్రామాల్లో శుక్రవారం శివరాత్రిని పురస్కరించుకుని ఆలయాలను శివపార్వతుల కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు సిద్ధం చేశారు.

చాగలమర్రి: మండలంలోని బుగ్గమల్లేశ్వర, రామలింగేశ్వర, భీమలింగేశ్వర, మలయచల, భైరవీశ్వర, గృహ మద్దిలేటి స్వామి ఆలయాలు శివరాత్రికి ముస్తాబయ్యాయి. బుగ్గమల్లేశ్వర ఆలయంలో 8న పూర్ణాభిషేకం, రుద్రాభిషేకం, వేద పండితుల ఆధ్వర్యంలో జరుగుతాయని ఆలయ అధ్యక్షుడు శివప్రసాద్, ఉపాధ్యక్షుడు మేడా బాబు, నవతా ప్రసాదు తెలిపారు. 9న శివపార్వతుల కల్యాణోత్సవం దంప తులతో నిర్వహిస్తామని అన్నారు.

ప్యాపిలి: మహాశివరాత్రి ఉత్సవాలకు మండలంలోని శివాలయాలను గత రెండు రోజులుగా నిర్వాహకులు ముస్తాబు చేస్తున్నారు. పట్టణంలోని నీలకంఠేశ్వరస్వామి, కాశీవిశ్వేశ్వరస్వామి, కాకనవరం, పెద్దపూదిళ్ల, పంచలింగాల, ఊటకొండ తదితర గ్రామాల్లోని శివాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

డోన్(రూరల్): డోన్ పట్టణ సమీపంలోని కొత్తబుగ్గ, పాతబుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. కొత్తబుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త కోట్రికే హరికిషణ్, పాతబుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త భైసాని రాజు ఆధ్వర్యంలో శివరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు.



డోన్‌లో..



ప్యాపిలిలో..

అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్టును అమలు చేయాలి

డోన్(రూరల్), మార్చి 7: రాజస్థాన్‌లో మాదిరిగానే ఆంధ్రప్రదేశ్‌లో కూడా న్యాయవాదులకు రక్షణగా అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్టును అమలు చేయాలని డోన్‌కు చెందిన న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ మేరకు న్యాయవాది పులి దామోదర్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సెక్రటేరియట్‌కు ఉత్తరాల ద్వారా లేఖను పంపారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయవాదులపై జరుగుతున్న దాడులను దృష్టిలో ఉంచుకుని రాజస్థాన్ రాష్ట్ర ముఖ్యమంత్రి న్యాయ వాదులకు రక్షణగా అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్టును అమలులోకి తెచ్చార న్నారు. అదే విధంగా ఏపీలో కూడా న్యాయవాదులకు రక్షణగా చట్టాన్ని తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఈ.శ్రీనివాసరెడ్డి, హరి మురళీధర్‌రావు, ఆలా మల్లికార్జునరెడ్డి, శ్రీనివాసులు, ఎస్‌టీ హరూన్, శ్రీధర్, మధుసూదన్, శివరామక్రిష్ణ, గోపాల్ రెడ్డి పాల్గొన్నారు

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం

దొర్నిపాడు మార్చి 7: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చాకరాజువేముల గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టోను వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు మల్లేశ్వరచౌదరి, లింగుట్ల వెంకట్‌నాయుడు, గంగవరం కృష్ణారెడ్డి, డీలర్ మోహన్‌నా యుడు, జగదీశ్వర్‌నాయుడు, డీలర్ హబీబ్‌బాషా, టీడీపీ మండల సెక్రెటరీ కొత్తపల్లి సురేంద్ర, చక్రవర్తినాయుడు, దయానందరావు, సిద్ధి సత్యం, సిద్ధి నారాయణ, అమరసాని రవి, మాజీ సర్పంచ్‌లు దస్తగిరి, నాగన్న, శ్రీనివాసులు ఉన్నారు.

వైసీపీ ఓటమి ఖాయం: కాంగ్రెస్

డోన్(రూరల్), మార్చి 7: రాష్ట్రంలో జరిగే సాధారణ ఎన్నికల్లో వైసీపీని ప్రజలు ఓడించడానికి సిద్ధమయ్యారని, వైసీపీ ఓటమి ఖాయమని డోన్ కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త గార్లపాటి మద్దిలేటి అన్నారు. గురువారం కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళను కలిసారు. డోన్ కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని ఆయన దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా గార్లపాటి మద్దిలేటి మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తున్నదని అన్నారు.

వేలంలో రూ.3.27 లక్షల ఆదాయం

బేతంచెర్ల, మార్చి 7: బేతంచెర్ల నగర పంచాయతీ ప్రాంగణంలో 2024-25 ఏడాదికిగాను నిర్వహించిన బహిరంగ వేలాల్లో రూ.3.27 లక్షలు నగర పంచాయతీకి ఆదాయం లభించినట్లు కమిషనర్ రమేష్ బాబు తెలిపారు. గురువారం సాయంత్రం కమిషనర్ సమక్షంలో బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. ఈ వేలంలో బండ్లమెట్ల రూ.13.77 లక్షలకు చంద్రశేఖర్ రెడ్డి, సంత మార్కెట్ రూ.10.05 లక్షలకు నాగేశ్వర రెడ్డి, కబేళాలు రూ.1.50 లక్షలకు మనోహర్ వేలాన్ని దక్కించుకున్నారని ఆయన తెలిపారు. గత ఏడాది రూ.22,59,600 వేలం పాటలు నిర్వహించగా.. ఈఏడాది రూ.25,52,660 వేలం పాటలు నిర్వహించగా.. రూ.3,27,400 పంచాయతీకి ఆదాయం పెరిగినట్లు కమిషనర్ తెలిపారు.

నీటి సామర్థ్యం పరిశీలన

రుద్రవరం, మార్చి 7: తుండ్లవాగు రిజర్వాయరులో నీటి సామర్థ్యాన్ని ఈఈ శంకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనరు రమేష్‌కుమార్ గురువారం పరిశీలిచారు. వారు మాట్లాడుతూ వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి తెలుగుగంగ పధ్రాన కాల్వ ద్వారా తుండ్లవాగు రిజర్వాయరుకు తాగునీటి సౌకర్యార్థం 0.15 టీఎంసీలు నీటిని నిల్వ చేసినట్లు తెలిపారు. హరినగరం మంచి నీటి పథకం నుంచి నీటిని తోడి ఆళ్లగడ్డతో పాటు ఇతర గ్రామాలకు తాగునీటి కోసం సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఏఈలు మోహనకృష్ణారెడ్డి, రాంప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రం తనిఖీ

చాగలమర్రి, మార్చి 7: చాగలమర్రి గ్రామంలోని వాసవీ జూనియర్ కళాశాల ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని గురువారం సిట్టింగ్ స్క్వాడ్ మురళీమోహన్‌రెడ్డి తనిఖీ చేశారు. 333 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 274మంది పరీక్షకు హాజరయ్యారని, 52 మంది గైర్హాజరయ్యారని చెప్పారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

డోన్(రూరల్), మార్చి 7: పట్టణం లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బీసీ సంక్షేమ సం ఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు మున్నీసాను పూలమా లలు, శాలువాలతో సన్మానించారు. అనం తరం సావిత్రీబాయి పూలే చిత్రపటాన్ని హెచ్‌ఎంకు బహూ కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ సుబ్బలక్ష్మి, బీసీ సంక్షేమ సంఘం సం యుక్త కార్యదర్శి ఏఈ నాగరాజు, నాయకులు సోమన్నగౌడు, మల్లికార్జున స్వామి, శ్రీరాములు, సామాజిక కార్యకర్త మహ్మద్‌రఫి పాల్గొన్నారు.

బేతంచెర్ల: నగర పంచాయతీ కార్యాలయంలో మెప్మా కోఆర్డినేటర్ శ్రీదేవి ఆధ్వర్యంలో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నగర కమిషనర్ రమేష్‌బాబు హాజరై కేక్‌ను కట్ చేశారు. కార్యక్ర మంలో వార్డు కౌన్సిలరు ఇబ్రహీం, పొదుపు మహిళలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బనగానపల్లె: మహిళా సాధికారతతోనే దేశపురోగతి సాధ్యమవుతుందని యాగంటిపల్లె కృషి విజ్ఞానకేంద్రం కోఆర్డినేటర్ ధనలక్ష్మి అన్నారు. గురువారం యాగంటిపల్లె కృషి విజ్ఞానకేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం కెవికె, బనగానపల్లె ఐసీడీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ధనలక్ష్మి మాట్లాడుతూ మహిళలు పెట్టుబడులు పెట్టి పురోగతిని వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీడీపీవో ఉమామహేశ్వరి, రోజారాణి, హోం సైంటిస్టు లక్ష్మిప్రియ, రవిగౌడ్, అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి శైలజ పిలుపునిచ్చారు. ఆళ్లగడ్డ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సీడీపీవో శ్యామల జ్యోతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం సీడీపీవో శ్యామల జ్యోతి న్యాయాధికారి శైలజను, మహిళా న్యాయవాదులు సరిత, హసీనా, ఎస్ఐ నగినాను సత్కరించారు. సీనియర్ న్యాయవాది శివరామిరెడ్డి, కమిషనర్ రమేష్‌బాబు పాల్గొన్నారు.



బనగానపల్లెలో మాట్లాడుతున్న కేవీకే కోఆర్డినేటర్ ధనలక్ష్మి



ఆళ్లగడ్డలో అధికారులకు సన్మానం

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని జనని సహాయక సహకార సంఘం ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. పీఠాధిపతి అభినవ శంకరానందస్వామి మహిళా దినోత్సవం గురించి వివరించారు. కుట్టు మిషన్ శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. విశ్రాంత ప్రిన్సిపాల్ రమణయ్య, జననీ సీఈవో వెంకటరమణ, ఏవో వెంకటసుబ్బయ్య, సంఘ సభ్యులు జ్యోతి, మార్తమ్మ, రేష్మా, పర్విన్, కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, నంద్యాలకు చెందిన జననీ సభ్యులు పాల్గొన్నారు.

చెన్నకేశవ ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ

రుద్రవరం, మార్చి 7: దేవాలయంలో గుప్తనిధుల వేటగాళ్ల దాడిలో దెబ్బతిన్న లక్ష్మీదేవి చెన్నకేశవస్వామి లక్ష్మీనరసింహస్వామి విగ్రహాల స్థానంలో నూతన విగ్రహాలను, నూతన ధ్వజస్తంభాన్ని గురువారం ప్రతిష్ఠించారు. రుద్రవరం మండలంలో ఆలయాల దీనావస్థపై 2023 జూన్ 21వ తేదీన కథనం ప్రచురితమైంది. దీంతో దేవదాయశాఖ అధికారులు స్పందించి విగ్రహాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఈవో సాయిజయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి'

రుద్రవరం, మార్చి 7: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకుడు బండారు బాలరాజు అన్నారు. గురువారం రాత్రి సూపర్‌సిక్స్ పథకాల బ్యానరును ఏర్పాటు చేశారు. ఇంటింటికి వెళ్లి మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. బాలరాజు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైసీపీకి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజలు టీడీపీ వైపే..'

రుద్రవరం, మార్చి 7: ప్రజలు టీడీపీ వైపు ఉన్నారని టీడీపీ నాయకుడు ఎర్రం ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దకంబలూరు, బోనంపల్లె గ్రామాల్లో గురువారం రాత్రి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. 282 పోలింగ్ కేంద్రం పరిధిలో ఇంటింటికి వెళ్లి మినీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయన్నారు.

గుడిసె దగ్ధం

రుద్రవరం, మార్చి 7: మండలంలోని రెడ్డిపల్లె గ్రామంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని గురువారం గుడిసె దగ్ధమైంది. అగ్ని ప్రమాదంలో మాధవికి చెందిన గుడిసె దగ్ధమైంది. వంట పాత్రలు, ధాన్యం బస్తాలు కాలిబూడిదయ్యాయి. గ్రామస్థులు సకాలంలో స్పందించి మంటలు పూర్తిగా ఆర్పివేశారు. రెవెన్యూ అధికారులు అగ్ని ప్రమాదంలో కాలిపోయిన గుడిసెను పరిశీలించి నష్టపరిహారం అందించాలని కోరారు.

భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

కొలిమిగుండ్ల, మార్చి 7: కొలిమిగుండ్ల మండలం ఇటిక్యాల గ్రామ పరిధిలో జగనన్న కాలనీకి సమీపంలో 738, 112/ఏ సర్వే నంబర్లలో జరుగుతున్న భూ ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల నాయకుడు సూర్యనారాయణ, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు వడ్డె బత్తుల మహేశ్‌లు కోరారు. గురువారం వారు మాట్లాడుతూ ఇటిక్యాల గ్రామ పరిధిలోను, ఇతర ప్రాంతాల్లో వైసీపీ నాయకులు, వారి మద్దతుదారులు అక్రమంగా ప్రభుత్వ స్థలాలు కబ్జా చేసి బేసి మట్టాలు నిర్మిస్తున్నారన్నారు. రెవెన్యూ అధికారులు అక్ర మంగా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న పట్టించుకోవడం లేద న్నారు.

పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌పై అవగాహన

ఆళ్లగడ్డ, మార్చి 7: పట్టణంలోని ఆర్టీసీ డిపో గ్యారేజీలో ఉద్యోగులకు పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ పథకంపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. పోస్టల్ అసిస్టెంటు మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పూదోట మఠంలో శివునికి అన్నాభిషేకం

బేతంచెర్ల, మార్చి 7: పరమేశ్వరునికి అత్యంత ప్రీతికరమైన మాఘమాసంలో లోక కళ్యాణార్థం పట్టణంలోని గౌరిపేట పూదోట మఠంలో వెలసిన బేతేశ్వర శివ లింగానికి సోమవారం అన్నాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మఠం నిర్వాహకులు గూండా గోపాల్, శివస్వాములు, గురుస్వామి మహేశ్వరరెడ్డి, భజన కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, చంద్రమౌళి పాల్గొన్నారు.

'అరాచక పాలనకు చరమగీతం పాడాలి'

చాగలమర్రి, మార్చి 7: వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలని టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా సూచించారు. చాగలమర్రిలోని మల్లేవేముల బస్టాండు వద్ద గురువారం సూపర్-6 ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొలిమి ఉసేన్‌వలి, కొలిమి షరీఫ్, మౌలాలి, అనీఫ్, ఖలీల్, మమహమ్మద్, ఎర్రన్న, రాజేష్ పాల్గొన్నారు.

వైసీపీకి ఓటుతో బుద్ధి చెప్పాలి

శిరివెళ్ల, మార్చి 7: ఒక్క అవకాశం అంటూ అధికారంలోకి వచ్చి ప్రజలను వంచించిన వైసీపీకి వచ్చే ఎన్నికల్లో ప్రజలు తమ ఓటుతో బుద్ధి చెప్పాలని టీడీపీ నాయకులు సత్తారు లక్ష్మీరెడ్డి, కమతం పుల్లారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని యర్రగుంట్ల టీడీపీ కార్యాలయంలో గురువారం వారు మాట్లాడుతూ అభివృద్ధే ధ్యేయంగా అహర్నిశలు కృషి చేసే చంద్రబాబుతోనే రాష్ట్ర ప్రగతి సాధ్యమవుతుందన్నారు. కమతం సుబ్బారెడ్డి, తపసి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'తాగునీటి సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి'

చాగలమర్రి, మార్చి 7: గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి ఉంచాలని ఎంపీపీ వీరభద్రుడు ఆయా శాఖల అధికారులకు సూచించారు. గురువారం చాగలమర్రి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి సమస్యను పరిష్కరించాలని అన్నారు. ఆయా శాఖల అధికారులు అభివృద్ధి పనులను వివరించారు. ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, ఎంఈవో అనూరాధ, ఏవో రంగనేతాజీ, హెచ్‌వో నరేష్‌కుమార్‌రెడ్డి, ఏఈలు కొండారెడ్డి, జగ్గయ్య, షఫివుల్లా, మండల పశువైద్యాధికారి సాయిబాబా, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

'వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యం'

చాగలమర్రి, మార్చి 7: వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యమని, టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు ఉంటుందని ఆళ్లగడ్డ టీడీపీ యువనాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి అన్నారు. మండలంలోని రాంపల్లె గ్రామంలో ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ విజయం కోసం సైనికుల్లా పని చేయాలని సూచించారు. టీడీపీ నాయకులు భార్గవ్‌రామ్, నరసింహారెడ్డి, లక్ష్మీరెడ్డి, రామిరెడ్డి, శివారెడ్డి, హరిశ్చంద్రారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, భూషన్న తదితరులు పాల్గొన్నారు.

రజియాబేగం మృతికి సంతాపం

బనగానపల్లె, మార్చి 7: బనగానపల్లె పట్టణం కొండపేటలోని శివనంది నగర్‌లో నివాసం ఉంటున్న హెడ్‌కానిస్టేబుల్ సజ్జద్ ఆలీ మాతృమూర్తి రజియాబేగం మృతికి మాజీ సర్పంచ్ బీసీ రాజా రెడ్డి గురువారం సంతాపం తెలిపారు. రజియాబేగం పార్థివ దేహానికి బీసీ రాజారెడ్డి నివాళి అర్పించారు.

పాఠశాల తనిఖీ

చాగలమర్రి, మార్చి 7: చాగలమర్రి గ్రామంలోని గిరిజన కాలనీ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో న్యామతుల్ల గురువారం తనిఖీ చేశారు. విద్యార్థుల గ్రేడింగ్‌ను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నాణ్యతగల కోడిగుడ్లు పంపిణీ చేయాలని అన్నారు. హెచ్‌ఎం నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.